# కళ్లు

నిద్ర గన్నేరు చెట్టుకింద నిలబడి సిటీ బస్ కోసం ఎదురుచూస్తున్న సీతాపతి మరో సారి టైం చూసుకున్నాడు.

అయిదూ ఇరవై!

అప్పుడే తాను అక్కడికొచ్చి పావు గంటయింది. ఇంకా బస్సు రాలేదు. వర్షం ఎక్కువవుతోంది. 'ఎక్కువవుతుందని తెలిసి కూడా గొడుగు తెచ్చుకొనక పోవటం మూర్ఖత్వం' – అని తనను తానే తిట్టుకున్నాడు.

పొద్దున్న ఆఫీసుకి బయలుదేరినప్పుడు బాగా మబ్బు పట్టింది. మధ్యాహ్నానికి తుప్పర ప్రారంభమైంది. బంగాళాఖాతంలో వాయుగుండంట! ఒకటే ఈదురుగాలి వీస్తోంది.

బస్సు ఇంకా రావటం లేదు.

'అసలివాళ ఆఫీసుకి రాకుండా ఉండాల్సింది!' అనుకున్నాడు. అయినా, రమ్మని తన నెవరూ బలవంతం చెయ్యలేదు. ఆ మధ్య నాలుగు రోజులు పని ఉండి, ఆఫీసుకు సెలవు పెట్టాడు. దాంతో ఫైల్సు చాలా పెండింగులో ఉండిపోయాయి... ఆదివారం అయితే ప్రశాంతంగా కూర్చుని పనంతా పూర్తి చేసుకోవచ్చుననుకుని వచ్చాడు.

"వచ్చినందుకు గొడుగైనా తెచ్చుకోవాల్సింది. పాడువాన ఎక్కువవుతోంది." – విసుక్కున్నాడు సీతాపతి.

'బస్సు వచ్చే జాడ కనిపించుట లేదు. వస్తుందో, రాదో? అసలే ఈ రూట్లో బస్సులు తక్కువ. వాతావరణం ఇలా ఉంటే ఇంకేం వస్తుంది? వచ్చినా, తన ఒక్కనికోసం ఆగుతుందో, లేదో?' – ఆలోచిస్తున్నాడు.

కనుచూపు మేరలో జనసంచారం కనిపించటం లేదు. తనకు కొంచెం దూరంలో, అదే చెట్టు కింద ఒక ముసలి తాత నిలబడి ఉన్నాడు. కళ్ళు లేని కబోది! ఒంటిమీద చినిగిపోయిన, మాసిన గుడ్డలు...చేతిలో ఊతకర్ర. పొడవైన చింపిరి గడ్డం... మెడలో పగడాల దండ...! చలిగాలికి వణుకుతున్నాడు.

"దిక్కుమాలిన వర్షం ... ఎక్కువైపోతోంది!" తనలో తాను గొణుక్కుంటున్న తాతవైపు చూశాడు సీతాపతి.

గుడ్డివాళ్ళను ఎప్పుడు చూసినా, చిన్నతనంలో జరిగిన ఆ సంఘటన గుర్తు కొచ్చి అతని మనసును చిరాకుపెడుతుంది.

సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం...

అప్పుడు తనకు పదేళ్ళు!

వీరభద్రా టాకీసులో 'అగ్గిరాముడు' సినీమా ఆడుతూంటే... అమ్మ దగ్గర పేచీ పెట్టి ఒక రూపాయి సంపాదించి సినీమాకు వెళ్ళాడు తను. హాలు దగ్గరకు చేరుకునేసరికి బుకింగ్ క్లోజయి పోయింది. ఆ పక్కనే ఎవరో 'బ్లాక్'లో టిక్కట్లు అమ్ముతున్నారు.

రూపాయి టిక్కట్టు – రూపాయిన్నర!

తన దగ్గర అంతా కలిపి రూపాయి పావలా ఉంది. సినీమా ఎలా అయినా చూడాలి... చూడాలంటే ఇంకో పావలా కావాలి! ఏం చేయాలో తోచలేదు. అప్పు అడుగుదామంటే స్నేహితులెవరూ కనిపించలేదు. నిస్సహాయంగా వెను తిరిగేడు. సరిగ్గా అప్పుడు సినీమా హాలు గేటు దగ్గర గోనె పట్టా వరుచుకుని అడుక్కుంటూ కూర్చున్న ఒక గుడ్డివాడు తనకు కనిపించాడు. అక్కడున్న మెర్క్యురీ దీపం వెలుగులో, గోనే పట్టా మీద నున్న చిల్లర డబ్బులు తళతళ మెరుస్తున్నాయి.

వాటిని చూడగానే తనకు ఒక పాడు ఆలోచన పుట్టింది. దాన్ని ఆచరణలో పెట్టడానికి క్షణం ఆలస్యం చెయ్యలేదు.

"తాతా! ఇందులో పావలా బిళ్ళ వేసి చిల్లర తీసుకుంటాను!" అన్నాడు.

"అలాగే, బాబూ! తీసుకో. ఈ గుడ్డోడికి సేసే దానం ఉత్తినే పోదులే, బాబూ. ఆ దేవుడు నిన్ను సల్లగా చూస్తాడు! బిడ్డ పాపలతో నువ్ సుకపడతావ్. తీసుకో, బాబూ! సిల్లర తీసుకో!" అన్నాడు తాత.

అంతే!

తాతకి తానేమీ వెయ్యకుండానే ఆ గోనెపట్టాపై వున్న నాలుగణాలు తీసుకుని, సినీమా హాల్లోకి పరుగెత్తేడు.

అప్పుడు తనకు పదేళ్ళు!

అప్పట్నుంచీ గుడ్డివాళ్ళు ఎక్కడైనా అడుక్కుంటూ కనిపిస్తే ఆ సంఘటనే గుర్తు కొచ్చి మనసును కలవరపెడుతూంటుంది.

ఇప్పుడూ అందుకే అన్యమనస్కు డయ్యాడు సీతాపతి.

మళ్ళీ మరోసారి టైమ్‌చూసుకున్నాడు. అయిదున్నర!

వానా గాలీ మరింత ఎక్కువయ్యాయి. ఆ గాలికి పూనకం వచ్చిన మనిషిలా, చెట్టు కొమ్మలు వూగుతున్నాయి. దట్టంగా అల్లుకున్న ఆ చెట్టుకొమ్మల మధ్య నించి పెద్ద పెద్ద వర్షం చినుకులు పడుతున్నాయి.

గుడ్డితాత మళ్ళీ ఏదో అంటున్నాడు

"ఏడిగా టీ పడితేగానీ ఒణుకు తగ్గేలా లేదు. ఈ సుట్టుపక్కల టీ దుకాణం ఏదైనా వుందేమో - ఎవరైనా దర్మాత్ముడు సాయం చేస్తే బాగుణ్ణు... బాబూ! ఈ పక్క నెవరూ లేరా, బాబూ! సచ్చి మీ కడుపున పుడతాను!"

అంత చిరాకులోనూ సీతాపతికి నవ్వొచ్చింది.

చచ్చిపోయిన తర్వాత సాయం చేసిన వాళ్ళ కడుపున పుట్టడం ఎందుకో? పుడితే మళ్ళీ గుడ్డివాడిగానే పుడతాడా? ఏమో?!

'పూజకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు' అంటారు.

క్రితం జన్మలో మంచి పూజలు చేయకపోతే.... ఈ జన్మలో మన్మథరావులా దుర్మార్గుడైన మొగుడొస్తాడు కాబోలు....

మన్మథరావు తన ఇంటి పక్కనే కాపురం వుంటాడు. ఏదో ప్రయివేటు కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ రాత్రి తాగొస్తాడు. రెండు రోజుల కొకసారైనా వాళ్ళావిణ్ణి ఎందుకో అందుకు చితక కొడతాడు.

వరలక్ష్మి మాత్రం క్రితం జన్మలో మంచి పూజలే చేసి వుంటుంది. అందుకే వరలక్ష్మికి తాను భర్తగా దొరికేడు. వరలక్ష్మిని తానెంతో ప్రేమిస్తున్నాడు. ఎటొచ్చీ గత జన్మలో వరలక్ష్మి దాన ధర్మాలు సరిగా చేసి వుండదు. అందుకే పెళ్ళయిన ఎనిమిదేళ్ళవరకూ తమకు పిల్లలు పుట్టలేదు. ఈ ఎనిమిదేళ్ళలోనూ తనూ, వరలక్ష్మి కలిసి మొక్కని మొక్కులేదు. చూడని దేవుడు లేదు. మొత్తానికి తమ పూజలు ఫలించాయి. ఇంత కాలానికైనా తమ కల ఫలించబోతోంది. రేపో మాపో తమ ఇంట పసిపాప బోసినవ్వులు వికసించబోతున్నాయి. తమ జీవితాలకు పరిపూర్ణత లభించబోతోంది.

ఇంటి దగ్గర వరలక్ష్మి ఎలా వుందో?'

ఈ గాలీ వానా లేకపోతే, సమయానికి సిటీబస్సు వచ్చి వుంటే, ఈ పాటికి ఇంటికి చేరుకుని వేడివేడిగా పకోడీలు తిని, ఆపై హార్లిక్సో, బోర్నవిటాయో తాగుతూండేవాడు. మామూలు రోజుల్లో అయితే తాను ఆఫీసు నుంచి ఇంటికి చేరుకునే సరికి వరలక్ష్మి కాఫీ తయారుచేసి ఫ్లాస్కులో పోసి వుంచేది.

కానీ పది రోజులనించీ వరలక్ష్మిని తాను మంచం దిగనివ్వటం లేదు. అసలు ఏడో నెల వచ్చినప్పుడే వరలక్ష్మిని పుట్టింటికి పంపించమని తన అత్తగారు ఉత్తరం రాసింది తాను జవాబు రాయలేదు.

"మొదటి పురుడు పుట్టింట్లో పొయ్యటం లోకాచారం!" అని మనిషిచేత మళ్ళీ కబురు పంపించింది ఆవిడ. అయినా తాను ఒప్పుకోలేదు. వరలక్ష్మిని వదిలిపెట్టి తాను వుండలేదు. అదీకాక, అక్కడ పల్లెటూళ్ళో అర్ధరాత్రీ అపరాత్రీ అవసరమైతే డాక్టరు కూడా దొరకదు.

'స్త్రీకి ప్రసవం మరో జన్మలాంటిది' అంటారు. అందుకే తను ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నాడు, వరలక్ష్మి విషయంలో! పొద్దున్నా, రాత్రీ పాలు... మధ్యలో రెండుసార్లు బత్తాయి రసం... ఏపిల్ పళ్ళూ, అరటిపళ్ళూ – అన్నీ వేళ ప్రకారం అందేలా ఏర్పాటు చేశాడు. రోజు విడిచి రోజు లేడీ డాక్టరు చేత పరీక్ష చేయిస్తున్నాడు. ఇంట్లో వంట పని చూడటానికి తన తల్లిని కూడా తీసుకొచ్చాడు.

నిజంగా క్రితం జన్మలో వరలక్ష్మి మంచి పూజలే చేసుకుని ఉంటుంది. ఇప్పుడు కూడా ప్రతిరోజూ భగవద్గీత, భారతం చదువుతోంది.

తమకు తప్పకుండా మగపిల్లాడే పుడతాడు! ఆడపిల్లయినా తనకు ఇష్టమే! అసలు పిల్లలే పుట్టరేమోఅని ఎంతో కాలం భయపడ్డాడు తను. అలాంటిది ఇప్పుడు ఆడపిల్ల పుడితేనేం? మరోసారి మగపిల్లాడు పుట్టకపోతాడా? కానీ వరలక్ష్మి మగపిల్లాడు కావాలనే కోరుకుంటోంది. ఈ తొమ్మిది నెలలనుంచీ తాను చదివిన నవలల్లో అందంగా కనిపించిన మగపేర్లన్నీ ఒక డైరీలో రాసుకుంది. మగపిల్లాడు పుడితే అందులోంచి మంచి పేరును ఎన్నుకుని వాడికి పెడుతుందట!

వరలక్ష్మి ఇప్పుడు ఏం చేస్తోందో?

ఆలోచనలు వరలక్ష్మి మీదకు మళ్ళేసరికి సీతాపతిలో అసహనం మరింత పేట్రేగిపోయింది. రాని బస్సునీ, కనిపించని ఆర్టీసీ వాళ్ళనీ కసి కసిగా తిట్టుకున్నాడు మనసులో.

అప్రయత్నంగానే మళ్ళీ టైమ్ చూసుకున్నాడు.

అయిదూ యాభై!

'ఛీ... ఛీ... అప్పుడే గంట కావస్తూంది తానక్కడకు వచ్చి. అంటే అరవై నిమిషాలు.! మూడువేల ఆరువందల క్షణాలు! జీవితంలో ఏది పోయినా, దాన్ని మళ్ళీ సంపాదించుకోవచ్చు! కానీ కాలం విలువైనది. పోయిన క్షణం మరి తిరిగి రాదు.

వర్షం వెలిసేలా లేదు. గాలి మరీ ఎక్కువైంది. ముసలితాత ఏదో అంటున్నాడు.

"బాబూ.... గుడ్డోణ్ణి, బాబూ! వరసంలో తడిసిపోతున్నాను. దగ్గర్లో ఎక్కడైనా టీ దుకాణం ఉంటే సేర్చండి, బాబూ! ధర్మ పెబువులు!"

వినిపించుకోలేదు సీతాపతి! బస్సుకోసం రోడ్డు చివరకు చూశాడు. శ్మశానంలా నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉంది... కానీ ఆ చిట్ట చివర దూరంగా శ్మశానంలో గోరీలా చిన్నపాక! శవం పూర్తిగా కాలిపోయిన తర్వాత చితిపై నించి ఇంకా పొగలు వస్తున్నట్టు పాకమీద నించి తెల్లటి పొగలు లేచి గాలివానలో కలిసిపోతున్నాయి...

బహుశా అది టీ దుకాణమే అయ్యుండాలి!

వేడి వేడిగా టీ తాగితే?!

అవును. టీ తాగాలి! ఈ వాన ఎప్పుడు తగ్గుతుందో, ఏమో? అంతవరకూ ఎలాగా బస్సులు రావు. ఈలోగా అక్కడికి వెడితే? వేడి వేడిగా టీ తాగి, ఒక సిగరెట్టు వెలిగించుకోవచ్చు! వెచ్చగా ఉంటుంది.

ఆ వూహ రాగానే కాళ్ళలోకి బలం పుంజుకొచ్చింది. జేబురుమాలు తీసుకుని తలపై వేసుకుని ఎగిరిపోకుండా దాన్ని ఎడం చేత్తో అదిమి పట్టుకుని అటువైపు పరుగెత్తేడు.

పాకలో వెచ్చగాఉంది. అయ్యరిచ్చిన టీ స్ట్రాంగ్‌గా ఉంది.

వరలక్ష్మి బోర్నవిటా తాగిందో, లేదో!

"టైమెంతయింది, సార్?" – అయ్యరు అడిగేడు.

"ఆరు!" వాచీ చూసి టైమ్ చెప్పాడు సీతాపతి.

"ఈ వర్షం ఇంక తగ్గేలా లేదు." గాజుగ్లాసుల్ని కడుగుతూ అన్నాడు అయ్యరు.

అంతలోనే ఏదో శబ్దం. మిన్ను విరిగి మీద పడిన శబ్దం! తన పక్కనే భూకంపం వచ్చినట్టు అదిరిపడ్డాడు సీతాపతి.

"సార్!" అయ్యరు కేక పెట్టాడు.

"అటు చూడండి, సార్!" చూపించాడు.

దూరంగా తాను అంతకుముందు ఏ చెట్టు క్రింద నిలబడ్డాడో అదే చెట్టు ఒక వైపు నేలకు ఒరిగింది. అంత వర్షంలోనూ అక్కడ చిన్న మంట కనిపించింది.

"పిడుగు పడింది, సార్!" కంగారుగా అన్నాడు అయ్యరు.

ఒక్కసారిగా నరాల్లో రక్త ప్రసారం ఆగిపోయినట్టు అనిపించింది సీతాపతికి.

తాను అక్కడే ఉండి ఉంటే?....

ఎలా ఉంటాడు?

క్రితం జన్మలో వరలక్ష్మి మంచి పూజలు చేసుకుంది. అందుకే దేవుడు తనను అక్కణ్ణించి తరిమేశాడు.

అన్నట్టు తాత ఏమయ్యాడో?

ఆత్రంగా అటు చూశాడు మళ్ళీ.

సరిగ్గా అంతకుముందు - అక్కడే తాత నిలబడ్డాడు - కొంపదీసి తాత...?

ఆ ఆలోచన వచ్చేసరికి ఉలిక్కిపడ్డాడు సీతాపతి. క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా అటువైపు పరుగెత్తేడు. అక్కడి దృశ్యాన్ని చూసిన సీతాపతి చలించిపోయాడు.

చెట్టు కొమ్మల క్రింద తాత శవం భయోత్పాతాన్ని కలిగిస్తోంది. అతని ముఖం మంటల్లో కాలిపోయి నల్లగా మాడిపోయింది. మెడలో దండ తెగిపోయి ఎర్రటి పగడాలన్నీ నేలమీద చెల్లాచెదురై నిగనిగా మెరుస్తున్నాయి.

మరుక్షణంలో జరిగే మారణ హోమం ఎలా ఉంటుందో మనిషి తెలుసుకోలేడు. సూర్యచంద్రులు ప్రకృతికి కాపలా కాస్తున్నట్లే ప్రాణమూ మృత్యువూ మనిషికి కాపు కాస్తుంటాయి కాబోలు.... వెన్నెల చల్లదనంలో ప్రాణానికి హాయిగా ఉన్నట్టు మృత్యువు కౌగిట్లో మనిషికి సేద తీరుతుంది. గూటి లోపల రామచిలుకలా ఒకటి లోపల పదిలంగా ఉంటే - భయపెట్టే రాక్షసిలా మరొకటి వెన్నంటి వెనుకనే ఉంటుంది. పంజరంలోంచి ప్రాణం ఎగిరిపోగానే పొంచి ఉన్న మృత్యువు మనిషిని ఆబగా ఆక్రమించుకుంటుంది - వేడి సూర్యుడు అస్తమించి, చలువ చంద్రుడు ప్రకృతిని జయించినట్టు!

కొన్ని ఏళ్ళకు సరిపడ ఆశలను గుండెలో పెంచుకునే మనిషి - మరు నిమిషం ఏం జరుగుతుందో ఎందుకు ఆలోచించలేకపోతున్నాడో?...

పాపం... ఆ చలిలో వణికిపోతూ వేడి వేడిగా టీ తాగాలని తాత ఎంత ఆశపడ్డాడో?

తాతని తనవెంట టీ దుకాణానికి తీసుకుని వెళ్ళుంటే? ... అతను బ్రతికేవాడు. తప్పకుండా బ్రతికేవాడు. తను చాలా పొరపాటు చేశాడు. - కాదు - పాపం చేశాడు. మానవత్వాన్ని మరచిపోయాడు.

ఏమో - అలా ఎందు కనుకోవాలి? 'శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు.'

అతనికి ఆ రకమైన చావు రాసి ఉంది. అందుకే అతన్ని అక్కణ్ణించి తీసుకెళ్ళమని ఆ దేవుడు తనను ప్రేరేపించలేదు.

తాతకు పెళ్ళాం ఉందో, లేదో?... ఉంటే, క్రితం జన్మలో ఆమె మంచి పూజలు చేసి ఉండదు.

ఆలోచిస్తున్న కొద్దీ సీతాపతి బుర్ర వేడెక్కిపోతోంది. మనసునంతా అసంతృప్తి, ఆవేదనా, ఆరాటం ఆక్రమించుకొంటున్నాయి. ఎటునించి ఆలోచిస్తున్నా - చివరకు అవన్నీ ఎదురు తిరిగి తననే వేలెత్తి చూపిస్తున్నట్టు - సమాధానం చెప్పమని సూటిగా తననే ప్రశ్నిస్తున్నట్టు అనిపిస్తోంది.

తాత మరణానికి కారణం తనా? కేవలం తనేనా?

ఇరవై ఏళ్ళ క్రితం తన వల్ల ఒక గుడ్డివాడు మోసపోయాడు. ఇప్పుడు తన వల్ల మరో గుడ్డివాడు మరణించాడు.

ఇలా ఎందుకు జరుగుతుందో?

అన్నట్టు అప్పుడూ ఆ సంఘటన ఆరు గంటలకే జరిగింది. మళ్ళీ ఇప్పుడు ఈ దారుణం కూడా సరిగ్గా ఆరు గంటలకే జరిగింది!

మళ్ళీ టైం చూసుకున్నాడు సీతాపతి. ఆరూ ఇరవై!

అప్పటికి వాన కొంచెం తగ్గుముఖం పట్టింది. సీతాపతికి కర్తవ్యం గుర్తు కొచ్చింది. మళ్ళీ టీ దుకాణానికి వెళ్ళి అయ్యరుకి విషయం చెప్పి పోలీసు స్టేషనుకీ, మునిసిపాలిటికీ మనుషుల్ని పంపించాడు.

ఏడయ్యేసరికి పోలీసు లొచ్చారు. మునిసిపాలిటి మనుషులు వచ్చారు. గవర్నమెంటు ఆస్పత్రినుంచి అంబులెన్స్ కూడా వచ్చింది.

ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయ్యేసరికి తొమ్మి దయింది.

ఈ లోగా పోలీసులు అతని వివరాలు సేకరించు కొచ్చారు. తాత పేరు శివయ్య... వృత్తి అడుక్కోవటం. నివాసం పొటిమీద. భార్యాపిల్లలు లేని అనాథ.

శవాన్ని మునిసిపాలిటీ వాళ్ళు తీసుకు పోయారు.

అలసిన శరీరంతో, వికలమైన మనస్సుతో సీతాపతి ఇంటికి చేరుకునే సరికి పదకొండయింది.

"వచ్చావురా, సీతా? ఇంత పొద్దుపోయిందేం? అక్కడే నిలబడు! కాస్తంత పంచదార నోట్లో వేస్తాను!" లోపలకు అడుగు పెట్టిన సీతాపతిని గుమ్మంలోనే నిలబెట్టి పంచదారకోసం వంటింట్లోకి నడిచింది అతని తల్లి.

ఆవిడ మాటలూ, ప్రవర్తనా ఆశ్చర్యాన్ని కలిగించాయి సీతాపతికి.

'అంటే, తన భార్య... వరలక్ష్మి ప్రసవించిందా?'

అనుకుంటూండగానే అతని తల్లి తిరిగి వచ్చింది.

చేతిలో పంచదార అతని నోట్లో పోసి -

"వరం ప్రసవించిందిరా! మగపిల్లవాడు - దబ్బ పండులా ఉన్నాడు. సాయంత్రం నొప్పులంటేనూ, లేడీ డాక్టర్ని పిలుచుకొచ్చాను. దేవుడి దయవల్ల అంతా సవ్యంగానే జరిగిపోయింది. సరిగ్గా ఆరింటికి పురుడొచ్చింది. భరణి నక్షత్రం. చాలా బాగుంది! అసలు భరణి నక్షత్రాన పుడితే ధరణి ఏల్తారట! కాళ్ళు కడుక్కు రా పిల్లాణ్ణి చూద్దువుగాని" అంటూ ఉత్సాహంగా చెప్పుకుపోతోంది ఆవిడ.

కానీ అవన్నీ వినిపించలేదు సీతాపతికి.

"పురుడు ఎన్నింటికి వచ్చిందన్నావ్?" కంగారుగా అడిగాడు తల్లిని.

"సరిగ్గా ఆరింటికి!"

"అయితే శివ య్యే మనింట్లో పుట్టేడన్నమాట!... మరి శివయ్యకి కళ్ళున్నాయా?" అని ఆత్రంగా ప్రశ్నిస్తూ పురిటి గదివేపు నడిచాడు సీతాపతి!

(ఆంధ్రప్రభ-వారపత్రిక జూన్, 81)

## ఉత్తమ సంస్కారానికి ఉపమాలంకారం

**జీడిగుంట రామచంద్రమూర్తి**

కథావస్తువును ఎన్నుకోవడంలోను, దాన్ని పాఠక ప్రేక్షక శ్రోతలకు అందించడంలోను, ఎదుటివాడు పొగుడుతూ ఉంటే అతణ్ణి నెమ్మదిగా ఆదుపు చేయగల ఇబ్బందికరమైన చిరునవ్వును చిందించడంలోను, ఎదుటివాణ్ణి ప్రశంసించాల్సిన సమయంలో అతకని 'అతి'తో బాధపడకుండా అతిజాగ్రత్తైన పదాల్ని ఉపయోగించడంలోను, ఎదుటివాణ్ణి మందలించాల్సిన పరిస్థితుల్లో నవ్వుతూ మెత్తని చివాట్లెయ్యడంలోను, అవతలివాడికోపం వచ్చి మనమీద రెచ్చిపోయి ఉంటే అలాంటి 'అన్‌కూల్'గా ఉన్నవాణ్ణి సైతం అనుకూలంగా మార్చుకోవడంలోను...

ఉదయం లేచిందగ్గిర్నుంచి రాత్రి పడుకునే వరకు పైన చెప్పిన ఇన్ని రకాల 'లోను'ల లోను ఎటువంటి ప్రభావానికీ లోనుకాకుండా 'ఎలోన్'గా నైనా నెగ్గుకురాగలనన్న ధీమాతో నిజాయితీతో అతి చక్కటి సంస్కారాన్ని మనస్ఫూర్తిగా ప్రదర్శించగల రచయిత, వ్యక్తి శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి.

రాజా

10-12-1991